



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

EVENING EDITION

4PM

www.suryaa.com పేజీలు: 02


| | |
|---|---|
| బంగారం ధర 10 GRMS 24 CARAT | ₹62,950 |
| వెండి ధర 1KG | 77,500 |
| సెన్సెక్స్ (123) | 71,263 |
| నిఫ్టి (43) | 21,502 |
| చికెన్ ధర 1KG | ₹160 |
| గుడ్ల ధరలు డజన్ | ₹68 |



## నష్టాల్లో స్టాక్ మార్కెట్

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఇవాళ ఫ్లాట్‌గా ప్రారంభమయ్యాయి. అమ్మకాల ఒత్తిడితో కాసే పటికే నష్టాల్లోకి జారుకున్నాయి. ఉదయం 9.30 గంటల సమయంలో సెన్సెక్స్ 178 పాయింట్ల నష్టంతో 71,207 వద్ద కొనసాగుతోంది. నిఫ్టీ 78 పాయింట్లు కుంగి 21,466 దగ్గర ట్రేడవుతోంది.

## 1001 మందికి శ్రీరాముడి పచ్చబొట్లు




నాగ్‌పూర్‌కు చెందిన హృతిక్ రాజేంద్ర దారోడే (22) అనే కళకారుడు అయోధ్య రాముడి ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని 1,001 మందికి ఉచితంగా పచ్చబొట్లు వేయాలని సంకల్పించుకున్నాడు. వివిధ రూపాల్లోని రాముడి చిత్రాలను చేతులు, ఛాతీ, భుజాలపై అందంగా డిజైన్ చేస్తున్నాడు. ఒక్కో టాటూకు హృతిక్‌కు రూ.350 ఖర్చు అవుతుంది. వెయ్యిమందికి సుమారు రూ.3.5 లక్షలు అవుతోంది.

## అండమాన్ నికోబార్ దీవుల్లో భూకంపం



అండమాన్ నికోబార్ దీవుల్లో బుధవారం ఉదయం 7.53 గంటల ప్రాంతంలో భూకంపం సంభవించింది. రిక్టరు స్కేలుపై 4.1 తీవ్రతతో భూమి కంపించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. భూమికి 10 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రాన్ని గుర్తించినట్లు తెలిపింది. ప్రపంచ వ్యాప్తంగా ఇటీవలే భూకంపాలు భయాందో ళనకు గురి చేస్తున్నాయి. కొత్త ఏడాది వేళ జపాన్‌ను వరుస భూకంపాలు వణికించిన విషయం తెలిసిందే.

## ఏపీకి బెస్ట్ పెవిలియన్ అవార్డు




బెంగళూరులో మిల్లెట్స్-ఆర్గానిక్స్‌పై 3 రోజులపాటు జరిగిన అంతర్జాతీయ సేంద్రీయ వాణిజ్య ప్రదర్శనలో ఆంధ్ర ప్రదేశ్‌కు బెస్ట్ స్టేట్ పెవిలియన్ అవార్డు లభించింది. ప్రదర్శనలో 20 రాష్ట్రాల తోపాటు విదేశీ రైతులు తమ ఉత్ప త్తులతో 250 స్టాల్స్ ఏర్పాటు చేశారు. స్టాల్ వాలిడేషన్ కమిటీ స్టాల్స్ ఏర్పాటు, ప్రదర్శించిన ఉత్పత్తులను పరిగణనలోకి తీసుకొని అవార్డులను ప్రదానం చేసింది.



## టెస్ట్ ర్యాంకింగ్స్ టాప్-10లోకి కోహ్లి, రోహిత్



ఐసీసీ తాజాగా విడుదల చేసిన టెస్ట్ ర్యాంకింగ్స్‌లో టీమిండియా స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ సత్తా చాటారు. చాలాకాలం తర్వాత ఈ ఇద్దరూ టాప్-10లోకి వచ్చారు. ఇటీవల దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో నాలుగు ఇన్నింగ్స్‌ల్లో 172 పరుగులతో రాణించిన కోహ్లి 775 రేటింగ్ పాయింట్లు సాధించి తొమ్మిదో స్థానం నుంచి ఆరో స్థానానికి ఎగబాకగా.. అదే దక్షిణాఫ్రికా సిరీస్‌లో ఓ మోస్తరు ప్రదర్శనతో పర్వాలేదనిపించిన హిట్‌మ్యాన్ 748 రేటింగ్ పాయింట్లు సాధించి 14 నుంచి పదో స్థానానికి చేరాడు. తాజా ర్యాంకింగ్స్‌లో టాప్-3 బ్యాటర్స్‌లో (కేన్ విలియమ్సన్, జో రూట్, స్టీవ్ స్మిత్) ఎలాంటి మార్పు లేకపోగా.. ఆసీస్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో దారుణంగా విఫలమైన పాక్ మాజీ కెప్టెన్ బాబర్ ఆజమ్ రెండు స్థానాలు కోల్పోయి ఎనిమిదో ప్లేస్‌కు పడిపోయాడు. ఆసీస్ మిడిలార్డర్ బ్యాటర్ మార్నస్ లబూషేన్ మూడు స్థానాలు మెరుగుప ర్చుకుని నాలుగో స్థానానికి ఎగ బాకగా.. అతని సహచరుడు ఉస్మాన్ ఖ్వాజా నాలుగు స్థానాలు కోల్పోయి తొమ్మిదో స్థానానికి పడిపోయాడు.బౌలింగ్ విషయానికొస్తే.. కేప్‌టౌన్ టెస్ట్‌లో ఆరేసి ఇరగదీసిన టీమిండియా పేసర్లు సిరాజ్ (17), బుమ్రా (4) ర్యాంకింగ్స్‌ను భారీగా మెరుగుపర్చుకోగా.. సౌతాఫ్రికా సిరీస్‌లో సరైన అవకాశాలు రాని రవీంద్ర జడేజా ఓ స్థానం కోల్పోయి ఐదో ప్లేస్‌కు పడిపోయాడు. పాక్‌తో సిరీస్‌లో హ్యాట్రిక్ ఐదు వికెట్ల ప్రదర్శ నలతో ఇరగదీసిన ఆసీస్ కెప్టెన్ పాట్ కమిన్స్ రెండో స్థానానికి ఎగబాకగా.. టీమిండియా స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ టాప్ ప్లేస్‌లో కొనసాగుతున్నాడు.



## సీఎం యోగి కీలక నిర్ణయం.. జనవరి 22న విద్యాసంస్థలకు సెలవు

### మద్యం అమ్మకాలు బంద్

అయోధ్య రామమందిర ప్రారంభోత్సవం సందర్భంగా 2024 జనవరి 22న ఉత్తరప్రదేశ్ లోని అన్ని అన్ని విద్యాసం స్థలకు సెలవు ప్రకటించాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆదేశాలు ఇచ్చారు. అలాగే రాష్ట్రంలోని అన్ని మద్యం షాపులను మూసివేయనున్నట్లుగా తెలిపారు. ఆ రోజు అన్ని ప్రభుత్వ భవనాలను సుందరంగా అలంకరిం చాలని, బాణాసంచా కాల్చి వేడుకలు జరుపుకోవాలని సీఎం ఆదిత్యనాథ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు రామజ న్మభూమి ఆలయంలో శ్రీరామ్‌లల్లా ప్రాణ-ప్రతిష్ఠ కార్యక్రమం కోసం జరుగుతున్న ఏర్పాట్లను సీఎం ఆది త్యనాథ్ పరిశీలించారు. ఉత్తరప్రదేశ్ లాగే తెలుగు రాష్ట్రాల్లో కూడా జనవరి 22వ తేదీన సెలువు ప్రకటిం చాలని రామ భక్తులు కోరుతున్నారు. శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠకు సంబంధించిన క్రతువులు ప్రధాన కార్యక్ర మానికి వారం రోజులు ముందుగా ఈ నెల 16వ తేదీ నుంచే ప్రారంభం కానున్నాయి. వారణాసికి చెందిన ప్రముఖ వేద పండితుడు లక్ష్మీకాంత్ దీక్షిత్ ఆధ్వర్యంలో 22న రామ్ లల్లా(బాల రాముడు) విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నారు. అయోధ్యలో ఈ నెల 14 నుంచి 22 వరకూ అమృత్ మహోత్సవ్ పేరిట రోజూ ప్రత్యేక కార్యక్రమాలు సైతం నిర్వహించనున్నారు. అయోధ్యలో ఈ నెల 22న శ్రీరాముడి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ వేడుకలను దేశమంతటా లైవ్ టెలికాస్ట్ చేసేందుకు బీజేపీ సన్నాహాలు చేస్తోంది. పట్టణాలు, పల్లెల్లో బూత్ లెవెల్‌లో భారీ స్క్రీన్లను ఏర్పాటు చేసి వేడుకలను లైవ్‌లో ప్రదర్శించేందుకు సిద్ధ మవుతోంది. వేడుకలు జరిగే రోజున అయోధ్యకు అందరూ వచ్చే అవకాశంలేనందున ప్రతి సామాన్యుడు ఉన్న చోటి నుంచే వేడుకలను వీక్షిస్తూ, బాల రాముడిని దర్శించుకునేలా చూడాలని పార్టీ భావిస్తోంది.




## జూలై 7న నీట్ పీజీ పరీక్ష

నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రన్స్ టెస్ట్-పీజీ పరీక్షను ఈ ఏడాది జూలై 7వ తేదీకి రీషెడ్యూల్ చేసినట్లు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ మంగ ళవారం తెలిపింది. ఈ పరీక్షకు కటాఫ్ అర్హత తేదీ ఈ ఏడాది ఆగస్ట్ 15గా పేర్కొంది. నీట్ పీజీ పరీక్షను మార్చి 3వ తేదీన నిర్వహించనున్నట్లు గతంలో ప్రక టించిన విషయం గుర్తు చేసింది. ఈ పరీక్షను సవ రించిన షెడ్యూల్‌ను అనుసరించి జూలై 7వ తేదీన నిర్వహి స్తామని వివరించింది. ఎండీ/ఎంఎస్, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఒకే ఒక్క అర్హత పరీక్ష నీట్ పీజీ ఎలిజిబిలిటీ కం ర్యాంకింగ్ పరీక్ష.



### కొడుకు కొత్త దుస్తులు కొనివ్వలేదని

## తండ్రి ఆత్మహత్య

కుమారుడు కొత్త దుస్తులు కొనివ్వలేదని అలిగిన తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. అమీన్‌పూర్ ఎస్సై రమణాచారి వివరాల ప్రకారం.. అన్నమయ్య జిల్లా వాయల్పాడు మండలం చాకిరేవుపల్లికి చెందిన రమణయ్య(63) కుమారుడు మహేశ్‌తో కలిసి 6నెలల క్రితం అమీన్‌పూర్ పురపాలక పరిధి పీజేఆర్‌ఎన్‌క్లేవ్ కాలనీకి వచ్చారు. మహేశ్ ఓ స్థిరాస్తి సంస్థలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. 3నెలల క్రితం రమణయ్యకు పక్షవాతం వచ్చింది. మంగళవారం మహేశ్ పుట్టినరోజు సందర్భంగా తనకు కొత్త దుస్తులు కొనాలని కుమారుడిని రమణయ్య అడిగాడు. జీతం వచ్చిన తరువాత కొంటానని మహేశ్ చెప్పాడు. దీనిపై తండ్రీకొడుకుల మధ్య గొడవ జరిగింది. మహేష్ ఉదయం బాత్‌రూంకు వెళ్లి వచ్చే సరికి సంస్థ కార్యాలయం పక్కనే ఉన్న కమాన్‌కు రమణయ్య ఉరేసుకున్నాడు.

# వైసీపీలోకి కేశినేని నాని?

ఏపీ ఎన్నికలు దగ్గరపడే వేళ తెలుగుదేశం పార్టీకు భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ విజ యవాడ ఎంపీ కేశినేని నాని పార్టీతో తెగ దెంపులు చేసుకోనున్నారు. త్వరలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధమైనట్టు తెలుస్తోంది. ఈ సందర్భంగా తనతో పాటు కొందరికి అవకాశం కల్పించాలని కోరినట్టు సమాచారం. విజయవాడ ఎంపీ, టీడీపీ సీనియర్ నేత కేశినేని నాని వైసీపీలో చేరు తున్నట్టు ప్రచారం గట్టిగా సాగుతోంది. టీడీపీకు రాజీనామా చేయనున్నట్టు చెప్పిన కేశినేని నాని..తిరిగి విజయవాడ నుంచే పోటీ చేస్తానని చెప్పారు. ఏ పార్టీ నుంచి పోటీ చేస్తారనేది స్పష్టత లేదు. తాజాగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారని తెలుస్తోంది. ఇప్పటికే స్థానిక వైసీపీ నేతలతో సంప్రదింపులు జరిగాయి. కేశినాని నాని వైసీపీ తీర్థం పుచ్చుకోవడం దాదాపుగా ఖరారైనా షరతుల విషయంలోనే సందిగ్ధత ఏర్పడుతోంది. నానితో పాటు పార్టీలో చేరనున్న మరి కొందరు టీడీపీ నేతలకు కూడా సీట్లు కేటాయించాలని కోరుతున్నట్టు సమాచారం. విజయవాడ పార్లమెంట్ సీటుతో పాటు ఆ పరిధిలోని 5 అసెంబ్లీ స్థానాలు కోరుతున్నట్టు తెలుస్తోంది. విజ యవాడ తూర్పు నుంచి కుమార్తె కేశినేని శ్వేత, విజయవాడ పశ్చిమం నుంచి మాజీ ఎమ్మెల్యే బేగ్, నందిగామ నుంచి కన్నెగంటి జీవరత్నం,



తిరువూరు నుంచి నల్లగట్లు స్వామిదాసు, మైలవరం నుంచి బొమ్మసాని సుబ్బారావులకు టికెట్లు కోరినట్టుగా తెలుస్తోంది. అయితే ఎంపీ సీటుతో పాటు రెండు అసెంబ్లీ సీట్లు ఇస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది. అయితే కేశినేని నాని సూచించిన ఐదు స్థానాల్లో ఇప్పటికే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల్ని ప్రకటించింది. ఈ క్రమంలో ఏం జరు గుతుందనేది ఆసక్తిగా మారింది. కేశినాని షరతులు వర్తిస్తాయా లేక షరతులు పక్కనబెట్టి వైసీపీ కండువా కప్పకుంటారా అనేది తెలియాల్సి ఉంది.

## నడ్డాతో బీజేపీ ప్రధాన కార్యదర్శుల సమావేశం

జనవరి 22 న అయోధ్య రామ మందిర్ ప్రారంభోత్సం..అలాగే త్వరలో జరగబోయే లోక్ సభ ఎన్ని కలకు సంబదించిన వివరాలను తెలుసుకునేందుకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శులతో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా సమావేశమయ్యారు.ఈ సందర్భంలో రామ మందిరం కోసం పార్టీ నిర్ణయించిన పనులను సమీ క్షించారు. అలాగే అయోధ్యకు వెళ్లే బీజేపీ సీనియర్ నేతలు, ప్రధాన కార్యదర్శుల బృందానికి చేయాల్సిన పనులపై సూచనలిచ్చారు. ఈ సమావేశానికి హాజరైన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, బీఎల్ సంతోష్, సునీల్ బన్సల్, వినోద్ తావ్డే, తరుణ్ చుగ్ బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాతో అయోధ్యకు వెళ్లి చేయాల్సిన పనులపై దశల వారీగా చర్చించారు. అలాగే లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి తన సాధారణ మంత్రులందరికీ నిర్దిష్ట బాధ్యతలను కూడా అప్పగించారు. వర్గాల నుండి



అందిన సమాచారం ప్రకారం.. బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా వినోద్ తావ్డేను జాయినింగ్ కమిటీకి అధిపతిగా నియమించారు.



## కేప్‌టౌన్ పిచ్ సరిగా లేదు: ఐసీసీ

భారత్, దక్షిణాఫ్రికా మధ్య జరిగిన రెండో టెస్టు మ్యాచ్‌లో టీమిండియా ఘన విజయం అందుకుంది. అయితే ఈ మ్యాచ్ జరిగిన కేప్‌టౌన్ పిచ్‌పై ఐసీసీ అసంతృప్తి వ్యక్తం చేసింది. టెస్టు క్రికెట్ చరిత్రలోనే అత్యంత త్వరగా పూర్తయిన మ్యాచ్ ఇది. ఈ నేపథ్యంలో పిచ్ సంతృప్తికరంగా లేదంటూ ఐసీసీ రేటింగ్ ఇచ్చింది. ఓ అయోగ్యతా పాయింట్ కూడా ఇచ్చింది. ఏ పిచ్‌కైనా ఐదేళ్ల కాలంలో ఆరు అయోగ్యతా పాయింట్లు వస్తే ఆ పిచ్‌పై ఏడాది నిషేధం విధిస్తారు.



## పట్టాలు తప్పిన చార్మినార్ ఎక్స్‌ప్రెస్

నాంపల్లి రైల్వే స్టేషన్‌లో చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రమాదం జరిగింది. పట్టాలు తప్పి ప్లాట్‌ఫామ్ సైడ్‌వాల్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో సుమారు 50 మంది ప్రయాణికులు గాయ పడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించారు. మొత్తం మూడు బోగీలు పట్టాలు తప్పగా, ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. నాంపల్లి చివరి స్టేషన్ కావడంతో డెడ్ ఎండ్ లైన్ చూసుకోకుండా లోకో పైలట్ వెళ్లినట్టు సమాచారం. దీంతో ట్రాక్ మీద నుంచి కిందకి రైలు బోగీలు జరిగాయి. రైలు.. చెన్నై నుంచి హైదరాబాద్‌కు చేరుకునే క్రమంలో ఈ ఘటన జరిగింది. స్టేషన్‌కు నెమ్మదిగా వస్తుండటంతో పెను ప్రమాదం తప్పింది. ప్రయాణికులు క్షేమంగా ఉన్నారని, కొందరు స్వల్పంగా గాయపడ్డారని దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



# క్యూట్ పోజులతో పూజా హెగ్డే


పూజా హెగ్డే ఓ మంచి హిట్ కోసం ఎదురు చూస్తోంది. ఇక ఈ ఫోటోలపై నెటిజన్స్ రకరకాలుగా స్పందిస్తున్నారు. కొందరు అదరగొట్టావ్ పూజా అంటే.. మరికొందరు మాత్రం.. ఇదేం డ్రెస్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇక ఈ భామ సినిమాల విషయానికి వస్తే.. రాధేశ్యామ్ మొదలుకొని, ఆ తర్వాత వచ్చిన బీస్ట్, ఆచార్య ఇలా వరుసగా బాక్సాఫీస్ దగ్గర తుస్సుమంటున్నాయి. దీంతో తెలుగులో అవకాశాలు తగ్గాయి.. పరిస్థితేమి బాగాలేదు.. దీనికి తోడు వచ్చిన సినిమా అవకాశాలు పోతున్నాయి.ఇక ఈ భామ సినిమాల విషయానికి వస్తే.. రాధేశ్యామ్ మొదలుకొని, ఆ తర్వాత వచ్చిన బీస్ట్, ఆచార్య ఇలా వరుసగా బాక్సాఫీస్ దగ్గర తుస్సుమంటున్నాయి. దీంతో తెలుగులో అవకాశాలు తగ్గాయి.. పరిస్థితేమి బాగాలేదు.. దీనికి తోడు వచ్చిన సినిమా అవకాశాలు పోతున్నాయి.





# గాజాలో పౌర మరణాలను ఐరాసలో ఖండించిన భారత్

ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంలో పౌర మరణాలపై భారత్ తన వైఖరిని ఐరాసలో పునరుద్ఘాటించింది. యుద్ధంలో అమాయకులు ప్రాణాలు కోల్పోవడం తమకు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని వెల్లడించింది. పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితిపై మంగళవారం జరిగిన ఐరాస జనరల్ అసెంబ్లీ సమావేశంలో భారత శాశ్వత ప్రతినిధి రుచిరా కాంబోజ్ మాట్లాడారు. "ప్రస్తుతం ఇజ్రాయెల్-హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధం.. చిన్నారులు, మహిళలు సహా పెద్ద ఎత్తున పౌరుల ప్రాణాలను బలి తీసుకొంది. ఫలితంగా భారీ మానవీయ సంక్షోభం తలెత్తింది. పౌర మరణాలను మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై ఉగ్రదాడే దీనంతటికి కారణమని మాకు తెలుసు. ఆ దిగ్భ్రాంతికర దాడిని కూడా ఖండిస్తున్నాం. ఉగ్రవాదాన్ని ఏమాత్రం ఉపేక్షించకపోవడమే భారత్ వైఖరి. పాలస్తీనా, ఇజ్రాయెల్ సహా ఈ ప్రాంతంలోని నాయకులతో భారత్ నిరంతరం టచ్‌లో ఉంది. జీ20, బ్రిక్స్, గ్లోబల్ సౌత్ సదస్సులో మా వైఖరి వెల్లడించాం. సంక్షోభ ప్రభావిత ప్రజలకు మేం సాయాన్ని కొనసాగిస్తాం. భద్రతా మండలి చేసిన 2720 తీర్మానం మానవీయ సాయాన్ని బలోపేతం చేస్తుందని విశ్వసిస్తున్నాం. ఇప్పటికే భారత్ 70 టన్నుల సామగ్రిని పాలస్తీనా ప్రజలకు అందించింది. వీటిల్లో 16.5 టన్నుల ఔషధాలు, వైద్య పరికరాలున్నాయి. కేవలం చర్చల ద్వారానే పరిష్కారం లభిస్తుందని ఈ సంక్షోభం మొదలైన తొలి రోజు నుంచి భారత్ చెబుతోంది. శాంతియుత, సుస్థిర పరిష్కార సాధనకు కట్టుబడి ఉన్నాం. 'రెండు దేశాల పరిష్కార' మార్గాన్ని బలంగా నమ్ముతున్నాం. అర్థవంతమైన చర్చల ద్వారానే ఇది సాధ్యం" అని భారత ప్రతినిధి పేర్కొన్నారు. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం విషయంలో భారత్ ఆచితూచి వ్యవహరిస్తోంది. తొలుత యుద్ధాన్ని తక్షణమే ఆపేయాలని కోరుతూ జోర్డాన్ ప్రవేశపెట్టిన తీర్మానంపై ఓటింగ్‌కు భారత్ గైర్హాజరైంది. ఆ తర్వాత గాజాలో కాల్పుల విరమణ పాటించాలనే డిమాండుతో డిసెంబర్‌లో ప్రవేశపెట్టిన తీర్మానానికి మద్దతు పలికింది.



# చర్చిలో బీజేపీ రాష్ట్ర చీఫ్ ప్రవేశాన్ని అడ్డుకున్న యువకులు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైను చర్చిలోకి వెళ్లనివ్వకుండా యువకులు అడ్డుకున్నారు. 'ఎన్ మన్...ఎన్ మక్కల్' పేరుతో అన్నామలై చేపట్టిన పాదయాత్ర ధర్మపురి జిల్లాలో సాగుతోంది. అందులో భాగంగా సోమవారం పాపిరెడ్డిపట్టికి చేరుకున్న అన్నామలై, ఆ ప్రాంతంలోని లూర్దుమలై అన్నై మేరీ చర్చిలోకి వెళ్తుండగా ప్రవేశద్వారం వద్ద యువకులు అడ్డుకున్నారు. మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులకు బీజేపీయే కారణమని, ఆ పార్టీకి చెందిన వారు మేరీ మాతకు పూలమాల వేసేందుకు అనుమతించమని యువకులు చెప్పారు. అన్నామలై సర్ది చెప్పబోయినా వారు వినలేదు. భద్రతా విధులో ఉన్న పోలీసులు ఆ యువకులను అక్కడి నుంచి పంపించి వేయడంతో, అన్నామలై చర్చిలోకి వెళ్లి మేరీమాత విగ్రహానికి పూలమాల వేసి తిరిగి వెళ్లిపోయారు.

## యూపీలోని అమ్రోహా జిల్లాలో ఘోరం..

# ఐదుగురు చిన్నారులు మృతి



రాత్రిపూట భోజనం చేసి నిద్రించిన కుటుంబంలో.. తెల్లారేసరికి ఐదుగురు చిన్నారులు విగతజీవులుగా మారారు. మిగతా ఇద్దరు పెద్దవారు ఆసుపత్రిలో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. వారి ఇంట్లోకి బయటి వ్యక్తులు ప్రవేశించిన ఆనవాళ్లు కానీ, కుటుంబంలో గొడవ జరిగిన సూచనలు కానీ కనిపించలేదని పోలీసులు చెబుతున్నారు. ఉత్తర ప్రదేశ్ లోని అమ్రోహా జిల్లాలో చోటుచేసుకుంది ఘటన.

సోమవారం రాత్రి మూసుకున్న ఇంటి తలుపులు మంగళవారం సాయంత్రం కావొస్తున్నా తెరుచుకోకపోవడంతో ఇరుగు పొరుగు వారు అనుమానించారు. బలవంతంగా డోర్లు తెరిచి లోపలికి వెళ్లి చూడగా.. కుటుంబం మొత్తం నిద్రలోనే ఉన్నారు. అందులో ఐదుగురు పిల్లలు అప్పటికే చనిపోయినట్లు గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఒకే కుటుంబంలో ఐదుగురు చనిపోయిన విషయం తెలిసి పెద్ద సంఖ్యలో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ప్రాణాలతో ఉన్న ఇద్దరు పెద్దవాళ్లను హుటాహుటిన ఆసుపత్రికి, మృతదేహాలను పోస్ట్ మార్టం కోసం తరలించారు. కాగా, ఈ ప్రమాదం జరిగిన ఇంటి యజమాని పేరు రహీజుద్దీన్ అని పోలీసులు తెలిపారు. చనిపోయిన వారిలో ముగ్గురు పిల్లలు రహీజుద్దీన్ సంతానం కాగా మిగతా ఇద్దరు బంధువుల పిల్లలని చెప్పారు. ఈ ఘటనలో రహీజుద్దీన్ భార్యతో పాటు అతడి తమ్ముడు చావుబతుకుల్లో ఉన్నారని వివరించారు. ఇంట్లో వెచ్చదనం కోసం పెట్టుకున్న కుంపటి వల్లే పిల్లలు ప్రాణాలు కోల్పోయినట్లు భావిస్తున్నట్లు చెప్పారు. గదిలోకి గాలి వచ్చే మార్గం లేకపోవడం, కుంపటి నుంచి వెలువడిన కార్బన్ డయాక్సైడ్ కారణంగా గాలిలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గి ఉండొచ్చని అంటున్నారు. దీంతో ఊపిరి ఆడక వారు నిద్రలోనే కన్ను మూశారని పోలీసులు చెబుతున్నారు.



## రోడ్డుపై ప్రజా పాలన అప్లికేషన్లు.. సర్కార్ సీరియస్..

# అధికారులపై సస్పెన్షన్ వేటు

ప్రజాపాలన అభయ హస్తం కార్యాక్రమానికి దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. కోటి 8 లక్షల 94 వేల అని లెక్క తెరపైకి వచ్చింది. డేటా బేస్ పరిశీలించి అర్హులందరికీ న్యాయం చేస్తామన్నారు మంత్రి పొంగులేటి. అయితే అభయ హస్తం పథకంపై అలా అభయం వచ్చిందో లేదో.. ప్రజాపాలన అప్లికేషన్లు రోడ్లపై ప్రత్యక్షకావడం సంచలనం రేపింది. ఎన్నో ఆశలతో ప్రజలు ఇచ్చిన అప్లికేషన్లు రోడ్లపై చిత్తు కాగితాల్లా పడిపోవడం చర్చగా . రచ్చగా కూడా మారింది. రోడ్లపై ప్రజాపాలన అప్లికేషన్లకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. ప్రజలు గంటలకొద్దీ లైన్లలో నిలబడి ప్రభుత్వంపై నమ్మకంతో దరఖాస్తులు పెట్టుకుంటే..ఆ అప్లికేషన్‌లు పాన్ షాప్‌లోకి ఎలా వెళ్లాయంటూ నెట్‌జన్స్ ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ ఘటనపై స్పందించారు. ప్రజలకు సంబంధించిన డేటా సైబర్ నేరగాళ్లకు చేరకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరుతూ ట్వీట్ చేశారాయన. కాగా ప్రజాపాలన అప్లికేషన్లు రోడ్డు మీద ప్రత్యక్ష కావడం వివాదాస్పదమైంది. ఈ వ్యవహారంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా స్పందించారు. అభయహస్తం దరఖాస్తులు.. బాలానగర్ ఫ్లైఓవర్‌పై కనిపించడంపై సీరియస్ అయ్యారు జీహెచ్ఎంసీ కమిషనర్. ఘటనపై పూర్తి వివరాలు అందించాలని డిప్యూటీ జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. రోడ్డుపై పడిన దరఖాస్తులు హయత్ నగర్ మండలానికి చెందినవిగా గుర్తించారు. డేటా ఎంట్రీ కోసం ఓ ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించగా.. వాళ్లు ర్యాపిడో వెహికిల్‌పై దరఖాస్తులు తీసుకెళ్తున్నారు. ఈ సమయంలో ర్యాపిడో బైక్ స్కిడ్ అయి కిందపడటంతో.. రోడ్డుపై పడిపోయాయి దరఖాస్తులు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన డేటా ఎంట్రీ టీమ్ లీడర్స్‌ను సస్పెండ్ చేశారు.




# లైవ్‌లో న్యూస్ ప్రజెంటర్‌కు తుపాకీ ఎక్కుపెట్టిన ముష్కరులు!

ఈక్వెడార్ రాజధాని గ్వయకిల్‌లో మంగళవారం సాయుధులైన కొందరు దుండగులు టీసీ టీవీ ఛానెల్ లైవ్ స్టూడియోలోకి ప్రవేశించి తీవ్ర కలకలం సృష్టించారు. మాస్కులు ధరించి తుపాకులు, డైనమైట్‌లతో వచ్చిన వీరు.. వార్తలు చదువుతున్న వ్యక్తి సహా అక్కడ ఉన్న ఇతర ఉద్యోగులను బెదిరించారు. వారిని నేలపై కూర్చోబెట్టి తలపై తుపాకీ ఎక్కుపెట్టారు. తమ వద్ద బాంబులు ఉన్నాయని, పోలీసులెవరూ ఇక్కడికి రారంటూ బెదిరించారు. ఇదంతా టీవీ ఛానెల్‌లో ప్రత్యక్ష ప్రసారమైంది. లైవ్‌లో తుపాకీ శబ్దాలూ వినిపించాయి. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి హాని జరగలేదని పోలీసులు తర్వాత వెల్లడించారు. ప్రస్తుతం 13 మంది నిందితులను అదుపులోకి తీసుకొని, ఉగ్రవాద చర్యల కింద కేసు నమోదు చేశారు. ఈ దాడి వెనుక ఉన్నది ఎవరనే విషయాన్ని ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. ఇటీవల జైళ్లనుంచి ఇద్దరు డ్రగ్ గ్యాంగ్‌స్టర్లు తప్పించుకున్నారు. ఆ తర్వాతే దేశంలో వరుసగా హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. తాజా ఘటన అందులో భాగమే అయి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

**దేశాన్ని విడిచి పోవాలనిపిస్తోంది: టీవీ ఛానెల్ అధిపతి**

టీసీ టీవీ ఛానెల్ అధిపతి మాన్రిక్ మాట్లాడుతూ.. "దుండగులు కార్యాలయంలోకి వచ్చినప్పుడు నేను కంట్రోల్ రూమ్‌లో ఉన్నాను. వారిలో ఒకరు నా దగ్గరకొచ్చి తలపై తుపాకీ గురిపెట్టాడు. నేలపై కూర్చోవాలని బెదిరించారు. నేనింకా షాక్‌లోనే ఉన్నాను. ఈ దేశాన్ని విడిచి ఎక్కడికైనా దూరంగా వెళ్లిపోవాలనిపిస్తోంది" అని చెప్పారు. స్టూడియోలో జరుగుతున్న ఘోరమంతా దాదాపు 15 నిమిషాల పాటు ప్రత్యక్ష ప్రసారమైందన్నారు. పోలీసులు చుట్టుముట్టారని గుర్తించిన దుండగులు తర్వాత తప్పించుకునేందుకు ప్రయత్నించారని తెలిపారు.



# రాజ్యసభకు వైసీపీ అభ్యర్థుల ఖరారు

వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, శ్రీనివాసులుకు అవకాశం రాజ్యసభ ఎన్నికలకు అభ్యర్థులను వైసీపీ ఖరారు చేసింది. రాష్ట్రానికి చెందిన వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి(వైసీపీ), కనకమేడల రవీంద్రకుమార్(టీడీపీ), సీఎం రమేష్(బీజేపీ)ల పదవీకాలం ఏప్రిల్ 3తో ముగియనుండటంతో వచ్చే నెలాఖరులో ఈ మూడు స్థానాలకు ఎన్నికల ప్రక్రియ మొదలవనుంది. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఈ సారి నెల్లూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేయించనున్నారు. అందువల్ల మూడు స్థానాలకూ కొత్త అభ్యర్థులను వైసీపీ అధ్యక్షుడు ముఖ్యమంత్రి జగన్ ఎంపిక చేశారు. జగన్ చిన్నాన్న.. టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, చిత్తూరు ఎమ్మెల్యే శ్రీనివాసులును ఖరారు చేశారు. బుధవారం వీరి పేర్లను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.